క్లుప్తంగా

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



కంకిపాడు: మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ డి.సందీప్ సూచించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాలతో డీఎస్పీ జయసూర్య, సీఐ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో మంగళవారం మత్తు పదార్థాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ డి.సందీప్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షణకు గురై చెడు వ్యసనాలకు చేరువ అవుతున్నారన్నారు. సరదాతో మొదలయ్యే అలవాటు జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందని చెప్పారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

గన్నవరంరూరల్: గురుకుల పాఠశాలలో సీటు భర్తీకి ఈ నెల 27వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వీరపనేనిగూడెం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పాఠశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 6వ తరగతిలో ఎస్సీ కేటగిరికి ఒక సీటు ఖాళీ ఉందన్నారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, మెరిట్ ఆధారంగా సీటును భర్తీ చేస్తామని చెప్పారు. వివరాలకు 91216 14398 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

దోమల నిర్మూలనతో ప్రజారోగ్యం మెరుగు



కంకిపాడు: దోమల నిర్మూలనతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు పట్టణంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పర్యవేక్షణలో దోమల నిర్మూలన మందు పిచికారీ పనులు మంగళవారం చేపట్టారు. దోమల మందు అబెట్ ద్రావణాన్ని కాలువలు, డ్రెయిన్లలో, నీరు నిలిచిన ప్రాంతాల్లో పిచికారీ చేయించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. వ్యర్థాలు డ్రెయిన్లలో పడేయటం వల్ల మురుగు పారుదుల నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, ఏఎస్ఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఆలంబనగా

ఉపాధి హామీ పథకం



గన్నవరంలో పంట కాలువ తవ్వుతున్న కూలీలు (ఫైల్)

- పంట కాలువల తవ్వకంతో రైతులకు మేలు
- ఉపాధి లభించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

గన్నవరంరూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా తవ్వుతున్న పంట కాలువలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయితీల్లో 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 232 చోట్ల పంట కాలువలు తవ్వారు. ఉపాధి కూలీలు పంట కాలువల తవ్వకంలో ముమ్మరంగా పాల్గొంటున్నారు. రూ.1.2 కోట్లతో జరిగిన పంట కాలువల తవ్వకం వచ్చే సీజన్‌లో పంటలకు ఊతం ఇవ్వడంతో పాటు సార్వా సీజన్‌కు కూడా ఉపయోగకరంగా ఉంటుందని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతరం పనుల్లో కూలీలు

మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 11,937 జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో 8,600 మంది నిరంతరం పనుల్లో పాల్గొంటున్నారు. పంట పొలాలకు జీవనాడిగా ఉపయోగపడే పంట కాలువల తవ్వకం కొనసాగుతోంది. ఉపాధి లభించడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రకాల పంట కాలువల తవ్వకాలు

నేరుగా కాలువల నుంచి పంట భూములకు నీరందించే మైనర్ చానళ్లు మూడు మీటర్ల నుంచి పది మీటర్ల వరకూ ఉపాధి కూలీలు తవ్వుతున్నారు. వాటి నుంచి దిగువకు నీరందించే డిస్ట్రిబ్యూషన్ చానళ్లు 1.2 మీటర్ల నుంచి 2.5 మీటర్ల వరకూ తవ్వకాలు చేస్తున్నారు. పంట భూముల మధ్య ఉండే ఫీల్డ్ చానళ్లు ఒక మీటరు లోతుతో తవ్వుతున్నారు. వీటి వల్ల కాలువ నీళ్లు కాని, వర్షం నీరు కాని సజావుగా పంట భూములకు చేరే వీలుంటుంది. పంట కాలువల తవ్వకంతో ఉపాధి కూలీలకు ఉపాధితో పాటు రైతాంగానికి మేలు జరుగుతుందని పథకం ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

మెట్ట గ్రామాలకు వరం..

గన్నవరం మండలంలో కొంత మాగాణి, మరి కొంత మెట్ట భూములు ఉన్నాయి. ఆరు గ్రామాల్లో మాగాణి ఉండగా, 15 గ్రామాలు మెట్ట ప్రాంత గ్రామాలుగా ఉన్నాయి. మెట్ట ప్రాంత గ్రామాల్లో చెరువు నీరు ఆధారంగా పంటలు పండుతాయి. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతాంగానికి పంట కాలువల తవ్వకం వరంగా ఉంది.



ఈడుపుగల్లులో నారుమడికి నీరు పెడుతున్న దృశ్యం

● నారుమడులు కళ కళ



ఖరీఫ్ వరి నారుమడులు కళకళలాడుతున్నాయి. బోర్ల సదుపాయం ఉన్న భూములు, బోదెల్లో మురుగు సదుపాయం ఉన్న భూముల్లో రైతులు వరి నారుమడిని సిద్ధం చేసి విత్తనాలను చల్లుకున్నారు. పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో రైతులు వరి నారుమడులు పోసుకున్నారు. ప్రస్తుతం నారు ఎదిగి పచ్చగా కళకళలాడుతోంది. నారు ఎదుగుదలకు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. పది రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. - కంకిపాడు

ఆర్ఎంపీలు క్రమశిక్షణ, కర్తవ్య దీక్షతో వృత్తి నిర్వహించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్ఎంపీలు క్రమశిక్షణ, కర్తవ్య దీక్షతో వృత్తిని నిర్వహించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకట రాజు చెప్పారు. స్థానిక విజయవాడరోడ్డులోని ఓ కల్యాణ మండపంలో హనుమాన్‌జంక్షన్ ఏరియా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రాథమిక చికిత్స అందిస్తున్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ప్రోత్సాహం, తోడ్పాటు అందించాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అభినందనలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం శ్రీకర హాస్పటల్స్ (విజయవాడ) ఆధ్వర్యంలో ఆర్ఎంపీలకు వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నందూరు ఉమాశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరాజు, జిల్లా కోశాధికారి కె.రంగారావు, హనుమాన్‌జంక్షన్ ఏరియా అధ్యక్షుడు కె.నరసింహరావు, ప్రధాన కార్యదర్శి కోటా చైతన్య, కోశాధికారి ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశం సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని కేఎల్ విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ ఆచార్యుడు డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సీమన్ మెన్స్ ఇంటిగ్రేటెడ్ సెన్సార్ టెక్నాలజీ అంశంపై ఐదు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ మంగళవారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. ఆ క్రమంలో అనేక రంగాలు సైతం అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు. దేశంలో సెమీ కండక్టర్ రంగంలోనూ వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. సెమీ కండక్టర్ రంగంలో ఉత్పత్తి దేశంలో చాలా తక్కువగా ఉందన్నారు. అవసరం మేరకు ఉత్పత్తి లేకపోవటంతో ఇతర అనుబంధ రంగాల్లో ప్రగతి కుంటుపడుతుందన్నారు. ఈ రంగంలో అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని చెప్పారు. మరో వక్తగా హాజరైన అమృత స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆచార్యులు డాక్టర్ పి.దీపక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సెమీకండక్టర్స్ సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలువాది మల్లికార్జునరావు, చిట్టా ఆమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతిని, నూతన ఆవిష్కరణలను వారికి తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగంలో ప్రగతిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ప్రవాసాంధ్రుల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సింగన్నగూడెంలో పునర్నిర్మిస్తున్న శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానానికి ప్రవాసాంధ్రులు బెజవాడ సతీష్, సాయి మౌనిక దంపతులు రూ.1,11,116 విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నక్కా శ్రీమన్నారాయణ, ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావులకు మంగళవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఇతోధికంగా సాయం అందించిన దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

డయేరియా నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి

గన్నవరంరూరల్: గ్రామాల్లో డయేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలని మండల వైద్యాధికారి పర్వతనేని శ్రీ హర్ష చెప్పారు. ముస్తాబాదలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు తాగునీరు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. సూరంపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, కార్యదర్శి కోట సురేష్‌బాబు ఆధ్వర్యంలో డయేరియా నివారణపై సిబ్బందికి, వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయాలన్నారు. ట్యాంకుల ద్వారా సరఫరా చేసే నీటిని వాడకానికి మాత్రమే వాడాలని, ఆర్వో నీటిని తాగడానికి ఉపయోగించాలని చెప్పారు. గ్రామంలో పని చేసే ఉద్యోగులందరూ గ్రామస్తులకు ఈ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు. అవగాహన అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని సత్కరించిన ఆర్ఎంపీ సంఘం నేతలు



పెనమలూరు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని రాష్ట్ర ఆర్ఎంపీ సంక్షేమ సంఘ నేతలు(ఆర్ఎంపీడబ్ల్యూఏ) సత్కరించారు. కానూరు మంత్రి కార్యాలయంలో మంగళవారం సంఘ నేతలు మంత్రి పార్థసారథిని కలిసి శాలువాతో సత్కరించి బొకె అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్, సంఘ సభ్యులు అయోధ్య సత్యనారాయణ, పి.సత్యనారాయణ, ఆర్.విద్యాసాగర్, బర్కతుల్లా, బి.వి.శ్రీనివాస్, బి.మోహన్, లక్ష్మికాంత్, గురువర్మ, ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని నూజివీడు రోడ్డు, కృష్ణా నగర్, ఐటీఐ రోడ్డు, మహత్మగాంధీ నగర్, రైల్వే స్టేషన్, ఇందిరా నగర్, గుడివాడరోడ్డు, బీసీ కాలనీ ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేసి ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జవాబుదారీతనంతో సేవలు

తనను కలిసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి పార్థసారథి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఉద్యోగి సంతోషంగా విధులు నిర్వహించేలా, సంతృప్తికర స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. మంత్రి పార్థసారథిని కలిసిన వారిలో కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రమేష్ , కోశాధికారి వి.సతీష్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి దిలీప్, శివలీల, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి ప్రసాద్, ఉపాధ్యక్షులు పి.మధుసూదన రావు, కేసర్ గణేష్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు అక్కిరాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, సహాధ్యక్షుడు పి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు

కోనేరుసెంటర్: తాడిగడప పరిసర ప్రాంతాల్లో ఈ నెల 27న ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడపలోని 100 అడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో రామోజీరావు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులు హాజరుకానున్న కారణంగా రవాణాకు అంతరాయం ఏర్పడకుండా ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు ఇలా

మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు ప్రయాణించే భారీ వాహనాలు 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కంకిపాడు వద్ద పూర్తిగా నిలిపివేస్తారు.

- విజయవాడ వైపు ప్రయాణించే వాహనాలకు సంబంధించి సాధారణ ట్రాఫిక్ ను పెనమలూరు నుంచి కృష్ణానది కరకట్ట మీదుగా న్యూ బ్రిడ్జి వరకు మళ్లిస్తారు.
- విజయవాడ వైపు నుంచి మచిలీపట్నం వెళ్లే వాహనాలను న్యూ బ్రిడ్జి వద్ద నుంచి విజయవాడ
- అవనిగడ్డ కరకట్ట మీదకు మళ్లిస్తారు.
- తాడిగడప 100 అడుగుల రోడ్డును 27వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి పూర్తిగా మూసేస్తారు
- దానికి బదులుగా నిడమానూరు పోరంకి రోడ్డును వినియోగిస్తారు.
- ఏలూరు హైవే నుంచిమచిలీపట్నం వెళ్లే సాధారణ ట్రాఫిక్ కు సంబంధించి ఎనికెపాడు 'ఎస్' కటింగ్ నుంచి నారాయణపురం కాలనీ మీదుగా పోరంకి వద్ద మచిలీపట్నం హైవే మీదకు మళ్లిస్తారు.

డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విలువలతో ఉండాలని, కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో, ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఒ.నజ్మా మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు విజయవాడ, పరిసర ప్రాంతాలలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతకు రూ.5వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో పాటుపడతామని, విజయవాడ సిటీని డ్రగ్ ఫ్రీ సిటీగా ఉంచటానికి సహకరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ వి.రవికాంత, అధ్యాపకులు గురుదేవి, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జ్యోతి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఆస్థాన మండపంలో ధాన్యకోటోత్సవం



స్వామి వారి సేవలను వీక్షిస్తున్న భక్తులు

- ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, చక్రస్నానం
- ఆస్థాన మండపంలో పవళింపు సేవ
- స్వామి వారి సేవలతో పులకించిన భక్తజనం



పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ కమిటీ, అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాలలో చివరి రోజున స్వామి వారికి విశేషంగా అభిషేకాలు, వసంతోత్సవం, చక్రస్నానంతో పాటు సాయంత్రం పవళింపు సేవలు నిర్వహించారు. మంగళవారం స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విన్నకోట రత్నమాచార్యులు పర్యవేక్షణలో అర్చక బృందం స్వామి వారికి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పంచామృత అభిషేకం అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, అర్చన, తులసీ దళాలతో అలంకరించారు. స్వామి వారి అభిషేక కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం ఆస్థాన కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తుల వద్ద ధ్యానకోటోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వేద పండితులు దేవస్థాన కమిటీకి, కార్యవర్గ సభ్యులకు వేద ఆశీర్వచనం అందజేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కల్యాణ మండపం వద్ద వసంతోత్సవాన్ని నిర్వహించగా ఆలయ అర్చకులు, పాలక మండలి, కార్యవర్గ సభ్యులు, ఉభయదాతలు, భక్తులు ఒకరిపై మరొకరు రంగులు, గులామ్ చల్లుకుంటూ వేడుకలో పాల్గొన్నారు. కల్యాణ మండపం ప్రాంగణంలో అవభృతోత్సవం, చక్రస్థానాది కార్యక్రమాలను నిర్వహించారు.

యాగశాలలలో పూర్ణాహుతి

ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులైన ఎల్.అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావులతో పాటు అర్చకులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కల్యాణ మండపంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పవళింపు సేవ జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొనగా వారికి ప్రసాదాల వితరణ జరిగింది. కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పాలక వర్గ సభ్యులు పాట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావు తదితరులు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడుకు చెందిన టి.అశ్విని, భర్త క్రాంతికుమార్(43), ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. క్రాంతికుమార్ గతంలో కారు డ్రైవర్‌గా పని చేసి ప్రమాదం జరగటంతో డ్రైవర్ పని మాని ప్రస్తుతం కూలీ పనులు చేస్తున్నాడు. భార్య అశ్విని స్వీపర్‌గా పని చేస్తోంది. కాగా ఈనెల 22న అశ్విని విధుల్లో ఉండగా భర్త మధ్యాహ్నం ఫోన్ చేసి తాను బైక్‌పై వస్తున్నానని తెలిపాడు. కొద్ది సమయం తరువాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి క్రాంతికుమార్ డివైడర్‌కు ఢీ కొట్టి గాయపడి ఉన్నాడని తెలిపాడు. దీంతో అశ్విని ఘటనా స్థలం వద్దకు వెళ్లి భర్తను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకు చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రాంతికుమార్ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో పోలసులు కేసు నమోదు చేశారు.